
# విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్

- కొత్త ఆదాయ పన్ను బిల్లుకు ఆమోదం
- స్కిల్ ఇండియా కోసం రూ.8,800 కోట్లు
- పీఎం కౌశల యోజన్4.0కు రూ.6000 కోట్లు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

3 లో




# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 08.02.2025

24 క్యారెట్లు 80,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:109

www.vishalabharati.com




# నా చేతుల్లో ఏమీ లేదు..

## కేబినెట్ విస్తరణకు మరింత సమయం

- మార్పులు చేర్పులపై అధిష్టానానిదే తుది నిర్ణయం
- నేను ఎవరి పేర్లూ సిఫార్సు చేయట్లేదు
- రాహుల్ గాంధీకి నాకూ ఎలాంటి గ్యాప్ లేదు
- కేటీఆర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం
- కులగణన ఆషామాషీగా చేసింది కాదు
- బీసీలు 5.30 శాతం పెరిగారు
- నేడో రేపో పీసీసీ కార్యవర్గ ప్రకటన
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

రాష్ట్రంలో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్లేనని సీఎం రేవంత్ రెడ్డి సంకేతాలు ఇచ్చారు. శుక్రవారం నాడు ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన, పలు కీలక అంశాలపై స్పందించారు. మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాలో అధిష్ఠానానిదే నిర్ణయమని తెలిపారు. తాను ఎవరి పేరూ సిఫారసు చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతలు కేసీఆర్, కేటీఆర్ కేసుల విషయంలో చట్ట ప్రకారం ముందుకు వెళతామన్నారు. తనకు ఉన్న అవకాశం మేరకు అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నానన్నారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కుల గణన ఆషామాషీగా చేసింది కాదన్నారు. ఎంతో పకడ్బందీగా చేశామన్నారు. సర్వే ప్రకారం బీసీలు 5.30 శాతం పెరిగారని చెప్పారు. లెక్కలతో సహా చూశాక బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ ఈ విషయాన్ని ఒప్పుకున్నారని వెల్లడించారు. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చిందని.. ఈరోజు లేదా రేపు ప్రకటన ఉంటుందని తెలిపారు. తాను రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదన్నారు. తనకు రాహుల్ గాంధీకి మధ్య గ్యాప్ లేదని స్పష్టం చేశారు. తమ ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఉందన్నారు. రాహుల్ గాంధీకి, తనకు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలియని వాళ్లు ఎన్ని మాట్లాడుకున్నా తనకేం కాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పని చేసుకుంటూ పోవడమే తనకు తెలుసునని, ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**విస్తరణకు బ్రేక్ అందుకేనా?**

డిసెంబర్ 7న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి తన కేబినెట్‌లోకి 11 మందిని మాత్రమే తీసుకున్నారు. ఈ సమయంలో నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చోటు దక్కలేదు. అయితే.. త్వరలో కేబినెట్ విస్తరణ ఉంటుందని ఆ సమయంలో సీఎం ప్రకటించారు. కానీ ఏడాది దాటినా ఇప్పటివరకు మంత్రివర్గ విస్తరణ కార్యరూపం దాల్చలేదు. దీంతో మంత్రివర్గంలో చోటుపై ఆశలు పెట్టుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి నేతలు ఇప్పటికే అసమ్మతి గళం విప్పడం స్టార్ట్ చేశారు. ఈ క్రమంలో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ

..మిగతా 2 లో




## ఈసారి కేజ్రీవాల్దేనా విజయం..?

- గత 3 ఎన్నికల్లో ఎగ్జిట్‌పోల్స్కు భిన్నంగా ఫలితాలు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- కౌంటింగ్కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

మరి కొద్ది గంటల్లోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. పోలింగ్ జరిగిన 70 అసెంబ్లీ స్థానాలకు శనివారం ఫలితాలు ప్రకటించనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్‌ఈకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 5న పోలింగ్

..మిగతా 2 లో



## తగ్గనున్న ఈఎంఐలు..!


- బిగ్ రిలీఫ్ ఇచ్చిన ఆర్బీఐ
- ఐదేళ్లలో తొలిసారి వడ్డీ రేట్లు తగ్గింపు
- వడ్డీ రేట్లపై 0.25 శాతం కోత

2 లో

## రెచ్చిపోతున్న కామాంధులు

- నార్సింగి పరిధిలో బాలికపై గ్యాంగ్ రేప్
- ఇబ్రహీంపట్నంలో విద్యార్థినిపై టీచర్ లైంగిక దాడి
- కేసు పెట్టేందుకు వచ్చిన మహిళకు కడుపు చేసిన కానిస్టేబుల్
- మేడ్చల్ పోలీస్ స్టేషన్లో ఘటన
- వరుస అత్యాచారాలతో భయపడుతున్న మహిళలు

2 లో





## దామరవంచ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- ప్రాణాల మీదకు తెచ్చిన బొబ్బర్లు
- వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు
- 16 మంది విద్యార్థులకు అస్వస్థత
- నలుగురు విద్యార్థుల పరిస్థితి సీరియస్
- వరుస ఘటనలతో మళ్లీ కలకలం
- ప్రభుత్వం హెచ్చరించినా మారని సిబ్బంది తీరు

..మిగతా 2 లో

## ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రానివ్వొద్దు..!

### కులగణనే అన్నింటికీ కొలమానం

- దాని ఆధారంగానే స్థానిక ఎన్నికల్లో సీట్లు, పదవుల పంపకాలు
- తెలంగాణ దేశానికే నమూనాగా నిలవాలి
- ఖర్గే, వేణుగోపాల్తో సీఎం, పీసీసీ చీఫ్ భేటీలో నిర్ణయం
- పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు.. 20 మందికి పైగా వైస్ ప్రెసిడెంట్లు
- గజ్వేల్ సభకు వచ్చేందుకు సరేనన్న ఖర్గే



..మిగతా 2 లో

# మీ-సేవలో రేషన్ కార్డులు..



- గుడ్ న్యూస్ చెప్పిన కాంగ్రెస్ సర్కార్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అనుమతి
- పేర్ల మార్పుల అప్‌డేట్‌కూ గ్రీన్ సిగ్నల్
- గత కొన్నాళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది ప్రజలు


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ వాసులకు రేవంత్ రెడ్డి సర్కార్ భారీ ఉపశమనం కలిగించే వార్త వినిపించింది. ఇప్పటికే రేషన్ కార్డుల కోసం చాలా మంది ఏళ్లుగా ఎదురుచూస్తుండగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా.. గ్రామాల్లో సర్వే చేసిన అధికారులు గ్రామసభల్లో అర్హుల జాబితాలు విడుదల చేశారు. అయితే.. ఆ జాబితా ల్లో పేర్లు రాని వాళ్లు తమకు రేషన్ కార్డులు ఇక రావని ఆందోళన చెందారు. అయితే.. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని.. మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.అయితే.. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారికి తాజాగా భారీ ఉపశమనం ఇచ్చే ప్రకటన చేసింది

..మిగతా 2 లో

## ఆర్టీసీ సమ్మె లేనట్లేనా..?

- సమ్మె వద్దు.. చర్చలకు రండి
- ఆర్టీసీ జేఏసీకి యాజమాన్యం పిలుపు
- 10న సాయంత్రం 4 గంటలకు చర్చ
- 9 నుంచే సమ్మె అని గతంలో ప్రకటించిన జేఏసీ
- చేయాలా..? వద్దా..? అని నేతల అయోమయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీ జేఏసీ సమ్మె దిశగా అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 9లేదా ఆ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ గతంలో ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆపరేషన్స్ ఈడీ మునిశేఖర్‌కు జనవరి 27న సమ్మె

..మిగతా 2 లో



## గురుకులాలను పట్టించుకోరా?

- కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి పరాకాష్ట
- వందల సంఖ్యలో ఫుడ్ పాయిజన్ ఘటనలు
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
08.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# మీ-సేవలో రేషన్ కార్డులు..

**తరువాయి భాగం:** ప్రభుత్వం. కొత్త రేషన్ కార్డు కోసం ఏదో ఫారమ్ నింపి.. ఏదో ఆఫీసుకు వెళ్లి.. దాన్ని అధికారికి ఇచ్చేందుకు గంటల తరబడి ఎదురుచూసే పని లేకుండా.. నేరుగా ఆన్‌లైన్‌లోనే అప్లయి చేసుకోవచ్చని సూపర్ న్యూస్ చెప్పింది సర్కార్. కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాకుండా ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో పేరు మార్పులు, చిరునామా మార్పులు, ఇతర మార్పులు, చేర్పులకు కూడా ఆన్‌లైన్ ద్వారా సులభంగా అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం.. మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాలకు వెళ్లి.. అవసరమైన మార్పులు చేర్పులు చేపించుకోవటమే కాకుండా.. కొత్త దరఖాస్తులను కూడా చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుకు, జారీకి నిర్దిష్టమైన గడువేమీ లేదని.. ఇది నిరంతరన ప్రక్రియ అని తెలంగాణ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం పదేపదే చెప్తోంది. అయితే.. తాజాగా ప్రభుత్వం తీసుకున్న ఈ ఆన్‌లైన్ నిర్ణయంతో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి భారీ ఉపశమనం లభించినట్టయింది.

# రెచ్చిపోతున్న కామాంధులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్లో కామాంధులు రెచ్చిపోతున్నారు. ఒకదాని తర్వాత మరోటి వరుస రేప్‌లు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటేనే మహిళలు వణికిపోతున్నారు. కాపాడాల్సిన పోలీసులు కూడా కాటేస్తున్నారు. తాజాగా జరిగిన మూడు రేప్‌లు సంచలనం సృష్టిస్తున్నాయి. నార్సింగిలో ఓ బాలికపై ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మరోవైపు మేడ్చల్‌లో కేసు పెట్టేందుకు వచ్చిన ఓ మహిళను కానిస్టేబుల్ గర్భవతిని చేశాడు. పలుమార్లు బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అలాగే ఇబ్రహీంపట్నం లయోలా పాఠశాలలో తాను టీచర్ అన్న విషయం మరిచిన ఓ కామాంధుడు పదోతరగతి బాలికపై అత్యాచారయత్నం చేశాడు.

**బాలికపై గ్యాంగ్ రేప్..**

రంగారెడ్డి జిల్లా నర్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైదర్‌షా కోట్‌లో గ్యాంగ్ రేప్ జరిగింది. బాలికపై ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం అక్కడ నుంచి పారిపోయారు. బాధిత బాలిక తల్లిదండ్రులతో కలిసి పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి బాలికను పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కామంతో రెచ్చిపోయిన ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

**కడుపు చేసిన కానిస్టేబుల్..**

మేడ్చల్ జిల్లాలో దారుణం జరిగింది. ఓ కేసు విషయంలో డబ్బులు వచ్చేలా చూడాలంటూ మేడ్చల్ పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఓ స్థానిక మహిళ(31)తో పరిచయం పెంచుకున్నాడు కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి. మాయమాటలు చెప్పి తన వలలో వేసుకున్నాడు. ఆమెకు న్యాయం చేస్తానని చెప్పి చివరికి గర్భవతిని చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. గతేడాది మార్చి 21వ తేదీన ఓ మహిళ డబ్బుల విషయంలో తనని కొందరు ఇబ్బంది పెడుతున్నారని తనకు ఆ డబ్బులు వచ్చేలా చూడాలంటూ మహిళ ఫిర్యాదు చేసింది. అయితే ఆమె నెంబర్ తీసుకున్న సుధాకర్ రెడ్డి మెల్లిగా పరిచయం పెంచుకున్నాడు. న్యాయం చేస్తానని నమ్మించి మహిళను ఇంటికి రప్పించి పెల్లి చేసుకుంటానని నమ్మబలికి అత్యాచారం చేశాడు. మరోసారి ఇలాగే ఇంట్లో తన అమ్మానాన్నలకు పరిచయం చేస్తానని చెప్పి ఇంటికి పిలిపించుకున్నాడు. పెళ్లి విషయం మాట్లాడుదామని భార్యలేని టైమ్ లో ఇంటికి రప్పించి ఇలా పలుసార్లు అత్యాచారం చేశాడు. ఈ క్రమంలో మహిళ గర్భవతి అయింది. దీంతో తనను కచ్చితంగా పెళ్లి చేసుకోవాల్సిందేనని మహిళ సుధాకర్ పై ఒత్తిడి పెంచడం మొదలుపెట్టింది. దీంతో ఆమె అబార్షన్‌కు ఒత్తిడి చేసి మందులు మింగించాడు సుధాకర్. అంతేకాకుండా తన భార్య సింధూజ, స్నేహితుడు కళ్యాణ్‌గౌడ్‌తో కలిసి ఆమెపై దాడి చేయించాడు. దీంతో బాధితురాలు కానిస్టేబుల్ సుధాకర్‌పై సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.

**విద్యార్థినిపై టీచర్ అత్యాచారయత్నం**

చదువులు చెప్పే టీచర్లు కామకోరికలతో నీతి మాలిన పనులు చేస్తున్నారు. విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలో మరో కీచక టీచర్ వ్యవహారం బయటపడింది. పాఠశాలలో చదివే విద్యార్థినిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నం లయోల స్కూల్ లోని ప్రిన్సిపల్ దీనావన్ రావు టెన్త్ విద్యార్థినిపై అత్యాచార యత్నం చేశాడు. విద్యార్థిని జరిగిన విషయాన్ని ఇంట్లో చెప్పడంతో దినావర్ రావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు ఆమె పేరెంట్స్. ప్రిన్సిపల్ దీనావన్ రావుపై పోక్సో కేసు నమోదు చేశారు పోలీసులు. దినావర్ రావుపై గతంలోనూ లైంగికదాడి ఆరోపణలున్నాయి. విద్యార్థినులను లోబర్చుకొని అత్యాచారం చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఓ సారి ఇలాగే చేస్తే విద్యార్థిని తల్లిదండ్రులు ఇతనికి దేహశుద్ధి చేశారు. ఇలాంటి ప్రిన్సిపల్‌ను అసలు వదలకూడదని అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆందోళన చేపట్టాయి.

# ఆర్టీసీ సమ్మె లేనట్లేనా..?

**తరువాయి భాగం**

నోటీసులు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 21 డిమాండ్ల పత్రాన్ని కార్మిక సంఘాల నేతలు ఈడీ మునిశేఖర్‌కు అందజేశారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆర్టీసీ జేఏసీని రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఈనెల 10న సాయంత్రం 4గంటలకు చర్చలకు రావాలని ఆర్టీసీ యాజమాన్యం, ఆర్టీసీ జేఏసీకి కార్మికశాఖ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించినట్టు కార్మికశాఖ పేర్కొంది.

ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని, రెండు పీఆర్సీలను అమలు చేయాలని.... 2021 వేతన సవరణను అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఫిబ్రవరి 9న లేదా ఆ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ వార్నింగ్ ఇచ్చింది. ఈ క్రమంలో కార్మిక శాఖ చర్చలకు ఆహ్వానించడంతో 9వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించాలా..? లేక చర్చల అనంతరం నిర్ణయం తీసుకోవాలా..? అని జేఏసీ నేతలు అయోమయంలో పడినట్లు సమాచారం.

# ఈసారీ కేజ్రీవాల్దేనా విజయం..?

**తరువాయి భాగం**

అనంతరం మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ బీజేపీకే పట్టం కట్టాయి. 27 ఏళ్ల తర్వాత 'కమల' వికాసం తథ్యమని ఢంకా బజాయించాయి. ఢిల్లీ ప్రజలు మార్పు కోరుతున్నారని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో స్పష్టమైందని బీజేపీ స్పందిస్తే, ఎగ్జిట్ పోల్స్ తమను తక్కువగా అంచనా వేసిన ప్రతిసారి అందుకు భిన్నంగా ఫలితాలు వచ్చాయని, ఈసారి కూడా ఆప్‌దే గెలుపని, నాలుగోసారి కేజ్రీవాల్ సీఎం పగ్గాలు చేపడతారని ఆమ్ ఆద్మీ పార్టీ ధీమా వ్యక్తం చేసింది.

**ఎగ్జిట్ పోల్స్అంచనాలు ఫలిస్తాయా..?**

2013 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అనంతరం ఎగ్జిట్ పోల్స్ బీజేపీకి అనుకూలంగా అంచనాలు వేశాయి. 35 సీట్లు బీజేపీ గెలుచుకుంటుందని, ఆప్, కాంగ్రెస్ చెరో 17 సీట్లు గెలుచుకుంటాయని అంచనా వేశాయి. అయితే అంచనాలకు భిన్నంగా ఆప్ 28 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 32 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 8 సీట్లు సాధించింది. దీంతో కాంగ్రెస్ సపోర్ట్‌తో ఆప్ స్వల్పకాలం ఢిల్లీలో పాలన సాగించింది. 2015లో 6 ఎగ్జిట్ పోల్స్ ఆప్ విజయం సాధిస్తుందని అంచనా వేసినప్పటికీ సాధించబోయే సీట్లను సరిగా అంచనా వేయలేకపోయాయి. ఆప్ యావరేజ్‌గా 45 సీట్లు గెలవచ్చని సర్వే సంస్థలు అంచనా వేశారు. అయితే ఆప్ 67 సీట్లతో రికార్డు స్థాయి విజయం సొంతం చేసుకుంది. బీజేపీ కేవలం 3 సీట్లకే పరిమితం కాగా, కాంగ్రెస్ ఖాతా కూడా తెరవకుండా చతికిల పడింది. 2020లో ఆప్ ఆధిపత్యం ఉంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే ఎన్ని సీట్లు గెలచవచ్చనే అంచనాల్లో విఫలమయ్యాయి. యావరేజ్‌గా 52 సీట్లు ఆప్ గెలుచుకుంటుందని, బీజేపీకి 17 వస్తాయని అంచనా వేశాయి. అయితే ఇందుకు భిన్నంగా ఆప్ 62 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 8 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ మరోసారి ఒక్క సీటు కూడా గెలవకుండా చతికిలపడింది.

అయితే.. 2025 ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను 'ఆప్' చీఫ్ కేజ్రీవాల్ తోసిపుచ్చారు. 55 సీట్లు ఆప్‌కు వస్తాయని, మహిళా ఓటర్లు పూర్తి స్థాయిలో ఓటింగ్ జరిపితే 55 నుంచి 60 సీట్లు వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని అన్నారు. ఏదిఏమైనా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమవుతాయా? కేజ్రీవాల్ జోస్యం ఫలిస్తుందా అనేది మరికొద్ది గంటల్లోనే తేలనుంది.

# ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రానివ్వొద్దు..!



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వంలోగానీ, పార్టీలోగానీ ఇకముందు తీసుకునే విధానపర నిర్ణయాలన్నింటికీ కులగణనే ప్రాతిపదికగా ఉండాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు జరిపిన భేటీలో నిర్ణయించినట్టు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, నిధుల కేటాయింపుల్లో కులగణన లెక్కలను కొలమానంగా తీసుకుని ముందుకెళ్లాలని.. స్థానిక సంస్థల ఎన్నికలు మొదలు నామినేటెడ్ పోస్టులు, పీసీసీ పదవుల భర్తీ దాకా ఇదే ఫార్ములాను అనుసరించాలని నిశ్చయానికి వచ్చినట్టు తెలిపాయి. రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణతో పాటు పలు రాజకీయ అంశాలపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు శుక్రవారం ఖర్గేతో భేటీ అయ్యారు. పార్లమెంట్‌లోని ఖర్గే కార్యాలయంలో సుమారు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించారు. అనంతరం పీసీసీ కూర్పుపై కేసీ వేణుగోపాల్‌తోనూ నేతలు విడివిడిగా భేటీ అయి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా ఇటీవల కొందరు ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీ అంశం కూడా ఖర్గే వద్ద ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. ఒకరిద్దరు మంత్రుల తీరు నచ్చక జరిగిన ఈ భేటీతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయని.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దీన్ని ప్రజల్లో తీవ్రస్థాయిలో చర్చకు పెట్టిందని నేతలు ప్రస్తావించారని సమాచారం. అయితే దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యేలతో మాట్లాడామని... ఏ విషయమైనా నేరుగా తమతో గానీ, అధిష్టానం పెద్దలతోగానీ మాట్లాడొచ్చని సూచించామని దీపాదాస్ మున్షీ, రేవంత్‌రెడ్డి వివరించినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రానివ్వొద్దని, వారితో ఎప్పటికప్పుడు చర్చించుకోవాలని, రెండు, మూడు నెలలకోసారి సీఎల్పీ భేటీలు నిర్వహించుకోవాలని ఖర్గే సూచించారని సమాచారం. బీఆర్ఎస్ బలంగా ఉన్న నేపథ్యంలో ఎలాంటి వదంతులు, తప్పుడు సంకేతాలకు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేసినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు పాలనకు పరీక్ష అని.. ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఖర్గే పేర్కొన్నట్టు తెలిసింది.

రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణలకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన అంశాన్ని రాష్ట్ర నేతలు ఖర్గేకు వివరించారు. దీనిపై రాష్ట్రంలోని నిమ్న వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ అంశాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి మూడు, నాలుగు జిల్లాలకు కలిపి ఒక సభను ఏర్పాటు చేస్తామని.. ఆ సభలకు హాజరుకావాలని ఖర్గేను కోరారు. ఇందులో ఎస్సీ వర్గీకరణ అంశంపై గజ్వేల్‌లో నిర్వహించే సభకు వచ్చేందుకు ఖర్గే ఒకే చెప్పినట్టు తెలిసింది. "జనాభా ప్రాతిపదికన అందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నది నాతోపాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాన ఉద్దేశం. కులగణనతో ఆయా వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని మేం విశ్వసిస్తున్నాం. విద్య, ఉద్యోగం, ఉపాధి, నిధుల కేటాయింపులలో ఓబీసీ, గిరిజన, దళితులు, మైనార్టీలకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు ఉండాలి..."అని ఖర్గే సూచించారని సమాచారం. తెలంగాణలో కులగణన, దాని ఆధారంగా అమలు చేసే అంశాలు దేశానికే దిక్సూచిగా నిలవాలని పేర్కొన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సైతం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వర్గీకరణను పూర్తి చేసిన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర నేతలకు ఖర్గే సూచించినట్టు తెలిసింది.

పీసీసీ కార్యవర్గ కూర్పుపై ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో రాష్ట్ర నేతలు జరిపిన భేటీలలో కొంతమేర స్పష్టత వచ్చినట్లు తెలిసింది. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను, 20 నుంచి 25 మంది వరకు వైస్ ప్రెసిడెంట్లను నియమించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. వర్కింగ్ ప్రెసిడెంట్లలో బీసీ, రెడ్డి, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారు ఉండాలనే భావనకు వచ్చినట్టు సమాచారం. ఇక జిల్లా నేతల ఆమోదం ఉన్న చోట్ల డీసీసీ అధ్యక్షులను ఒకట్రెండు రోజుల్లో ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

# గురుకులాలను పట్టించుకోరా..?

- **కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి పరాకాష్ట**
- **వందల సంఖ్యలో ఫుడ్ పాయిజన్ ఘటనలు**
- **ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు దవాఖాన పాలుకావడం సర్కారు నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో వందల్లో సంఖ్య లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని శుక్రవారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. వందల మంది విద్యార్థులు దవాఖానల పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడి తే అరెస్టులు చేస్తామని సీఎం ప్రకటించినా ఎకడ వేసిన గొంగళి అకడే అన్న చందంగా మారిందని, రేవంత్ మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు అనేందుకు గురుకులాల దీనస్థితే నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగకుండా చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


# నా చేతుల్లో ఏమీ లేదు..

**తరువాయి భాగం**

లేనట్లేనని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో చెప్పడం సంచలనంగా మారింది. ఈ ప్రకటనపై మంత్రివర్గంలో చోటు కోసం ఎదురు చూస్తున్న వారు ఎలా రియాక్ట్ అవుతారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. మంత్రివర్గ విస్తరణ పూర్తిచేస్తే చోటు దక్కని వారు పంటి కింద రాయిలా మారుతారని పార్టీ హైకమాండ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వారి ఆశలు సజీవంగా ఉంచేందుకే విస్తరణ పూర్తి చేయడం లేదనే టాక్ వినిపిస్తోంది. ఇటీవల పది మంది ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్, ఢిల్లీకి వెళ్లి మరి జూపల్లి కంప్లైంట్ ఇవ్వడం లాంటి పరిస్థితుల నేపథ్యంలో తేనె తుట్టెను కదపడం ఏమాత్రం సరికాదనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.

# తగ్గనున్న ఈఎంఐలు..!

- **బిగ్ రిలీఫ్ ఇచ్చిన ఆర్బీఐ**
- **ఐదేళ్లలో తొలిసారి వడ్డీ రేట్లు తగ్గింపు**
- **కీలక వడ్డీ రేట్లపై 0.25 శాతం కోత**



**విశాలభారతి, నేషనల్బ్యూరో:**

విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ఆర్‌బీఐ ఎట్టకేలకు సవరించింది. రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ఉదయం వెల్లడించారు. దీంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగొచ్చింది. వడ్డీ రేట్లను సవరించడం రెండేళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. మే 2023 తర్వాత నుంచి కీలక వడ్డీ రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచుతూ వస్తోంది. దాదాపు ఐదేళ్ల తర్వాత రెపో రేటు 6.25 శాతానికి చేరడం గమనార్హం. ఈ తగ్గింపుతో రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది.

సంజయ్ మల్హోత్రా ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (MPC) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. బ్యాంకులు అకస్మాత్తుగా ఆర్‌బీఐ వద్ద పూచీకత్తు లేకుండా డిపాజిట్లు చేసినప్పుడు వాటిపై స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (SDF) రేటును వసూలు చేస్తారు. ఎస్‌డీఎఫ్ రేటును 6 శాతంగా, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు, బ్యాంక్ రేటును 6.5 శాతంగా నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా చెప్పారు.

కరోనా సంక్షోభ కాలం (2020 మే) తర్వాత ఆర్‌బీఐ రెపోరేటును తగ్గించడం ఇదే తొలిసారి. 2020 మే నుంచి 2022 ఏప్రిల్ మధ్యకాలంలో ఆర్‌బీఐ రెపోరేటు స్థిరంగా 4 శాతంగా ఉంది. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు అది స్థిరంగా 6.5 శాతం వద్ద ఉంది. నాటి నుంచి ఈరోజు వరకు రెపోరేటును 6.5 శాతం వద్దే కొనసాగించారు. "అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థల్లో నెలకొంటున్న మార్పుల ప్రభావం కూడా మన ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది. దీనివల్ల ప్రపంచ దేశాల వాణిజ్యంపైనా ప్రతికూల ప్రభావం పడింది. ఫలితంగా ఆయా ఆర్థిక వ్యవస్థల వృద్ధి చారిత్రక కనిష్ఠ స్థాయిలకు పడిపోయింది. అమెరికాలోనూ వడ్డీరేట్లను భారీగా తగ్గిస్తారనే అంచనాల వల్లే అమెరికా డాలర్ బలోపేతం అవుతోంది. ఈ ప్రతికూలతల వల్లే ఇటీవలే భారత రూపాయిలో క్షీణత కనిపించింది" అని ఆర్‌బీఐ గవర్నర్ చెప్పారు.



## దామరవంచ గురుకుల పాఠశాలలో
# ఫుడ్ పాయిజన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు చోటు చేసుకొంటున్నాయి. తాజాగా మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు మండలం దామరవంచ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. గురుకుల పాఠశాలలో చదువుతోన్న 16 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో.. అందులో నలుగురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో గురుకుల పాఠశాల సిబ్బంది వెంటనే స్పందించి.. వారిని గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నారు.

ఈ పాఠశాలలో మొత్తం 500 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గురువారం సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ ఇచ్చే సమయంలో బొబ్బర్లు పెట్టారు. అవి తిన్న విద్యార్థులు.. గత అర్ధరాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు కావడంతో.. తీవ్ర అస్వస్థతకు వారు గురయ్యారు. దీంతో పాఠశాలలోని ఏఎన్ఎం వెంటనే మందులు ఇచ్చింది. అయితే 16 మందిలో నలుగురు పరిస్థితి కొంత తీవ్రంగా మారడంతో.. వారిని గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం కోసం.. డైట్ ఛార్జీలను 40 శాతం మేర పెంచామన్నారు. అయినా సిబ్బంది తీరు మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వారికి నాణ్యమైన విద్య పెట్టాలని సిబ్బందికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ సూచించారు. మరోవైపు ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ మాలోత్ కవిత స్పందించారు. ఈ కాంగ్రెస్ ప్రభుతం ఏర్పడిన ఫుడ్ పాయిజన్ సంఘటనలు చాలా చోటు చేసుకున్నాయని మండిపడ్డారు. చిన్నారుల భవితకు బాటలు వేయాల్సిన ఈ ప్రభుత్వం నరకానికి బాటలు వేస్తోందని విమర్శించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
08.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు?

విశాలభారతి, స్టేట్ బ్యూరో: హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని ఏ చట్టంలో ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలను బీసీల్లో ఎలా కలుపుతారని నిలదీశారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. దీనిపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇవాళ ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసలు కులగణన జరిపిన విధానమే సరిగా లేదని, 50 శాతం ఇళ్లకు సర్వే సిబ్బంది వెళ్లనేలేదని ఆరోపించారు. తెలంగాణలో కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్య వల్ల బీసీల సంఖ్య తగ్గిందన్నారు. ఇది చాలా విచారకరం అని చెప్పారు. తూతూమంత్రంగా సర్వే చేశారని విమర్శించారు. ఈ సర్వేపై అనేక బీసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ సర్కార్.. ముస్లిం బీసీ, హిందూ బీసీలు అని కొత్త పాలసీ తెచ్చిందని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి విధానం దేశంలో మరెక్కడా లేదని స్పష్టంచేశారు. ప్రజలను కులం, మతం పేరుతో విభజించడం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీకి అలవాటేనని దుయ్యబట్టారు. తమకు న్యాయం కావాలని ఓ వైపు బీసీలు కొట్లాడుతుంటే ముస్లింలను తీసుకొచ్చి బీసీల్లో కలపడం ద్వారా వారికి కాంగ్రెస్ పార్టీ మరింత అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఇది పూర్తిగా బీసీ వ్యతిరేక విధానం అని తేల్చి చెప్పారు.



## పోలింగ్ కేంద్రాలలో వసతులను పరిశీలించిన కలెక్టర్

**బాల్కొండ,విశాలభారతి:** నిజామాబాద్,కరీంనగర్,ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలతో కూడిన శాసన మండలి ఉపాధ్యాయ,పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని భీంగల్,వేల్పూర్,పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు.ర్యాంప్, టాయిలెట్స్,విద్యుత్ సరఫరా,నీటి వసతి ఇత్యాది సదుపాయాలను పరిశీలించారు. ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్,స్థానిక అధికారులు తహశీల్దార్ షబ్బీర్,ఎంపిడిఓ సంతోష్ కుమార్,ఎంఈఓ స్వామి,ఎస్సై మహేష్ తదితరులు ఉన్నారు.

# అమరవీరుల స్థూపాన్ని కూల్చితే అమరులం అవుతాం

- మరో పోరాటానికి ఉద్యమకారులు సిద్ధంగా ఉండాలి
- నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి

**భీమదేవరపల్లి, విశాలభారతి:** 60 ఏళ్ల అలుపెరుగని పోరాటం, ఆంధ్ర వలస పాలకులు ఉద్యమాన్ని అణిచివేసేందుకు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ కోసం 1200 మంది విద్యార్థి ఉద్యమకారులు తమ ప్రాణాలను అర్పించారు. అలాంటి అమరుల త్యాగాల పునాది మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో వారి త్యాగానికి గుర్తుగా అమరవీరుల స్థూపాలను నిర్మించడం జరిగింది. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో స్థూపాన్ని నిర్మించి వారి త్యాగాలను గుండెల్లో స్థిరంగా నిలుపుకున్న సందర్భంలో, రోడ్డు వెడల్పులో భాగంగా రూపాన్ని తొలగించమంటే బతికున్న ఉద్యమకారుల కలలను తీసినట్లే అవుతుందని నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని, అమరవీరుల స్థూపాన్ని కాపాడుకొని మరింత సుందరంగా జంక్షన్ ఏర్పాటు చేయాలని, లేకుంటే మరో పోరాటానికి శ్రీకారం చుట్టడానికి ఉద్యమకారులు సిద్ధంగా ఉండాలని కోరారు.





## తెలంగాణను అప్పుల కుప్ప చేసింది కేసీఆర్

- ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నది కాంగ్రెస్
- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట, విశాలభారతి:** లక్షల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని, అయితే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ముందుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా నాశనం చేశారని ఆరోపించారు. కెసిఆర్ అసమర్ధ పాలన వలన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం కాలంలో అనేక హామీలను అమలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షఫీ ఉల్లా, ముదిరెడ్డి రమణారెడ్డి, వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు, నరేడ్ల సోమయ్య, ఉపేందర్, కరుణాకర్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ సమాజ సేవకు కొంతైనా తోడ్పాటును అందించాలి

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రతి ఒక్కరు సమాజ సేవకు కొంతైనా తోడ్పాటు అందించాలని శ్రీ భానుపురి సేవా బృందం నిర్వాహకులు శ్రీరంగం రాము తెలిపారు. శుక్రవారం చిలంచర్ల అనంత రాములు 3 వ వర్ధంతి సందర్భంగా వారి కుమార్తెలు వెంపటి రజని, సోమా కృష్ణవేణి, నకరికంటి వేదవతి, వనపర్తి మమత, గుండా స్వప్న ,శ్రీ భానుపురి సేవాబృందం వాసవి యూత్ క్లబ్ సూర్యాపేట ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో 200 మంది పేషంట్ల సహాయకులు, సిబ్బందికి అన్న ప్రసాద వితరణ, ఆస్పత్రిలో డెలివరీ అయిన తల్లి పిల్లలకు బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ, అన్ని వార్డులో ఉన్న రోగులకు ఫ్రూట్స్ బాక్సుల పంపిణీ, శ్రీ అన్నపూర్ణ అనాధ మానసిక వికలాంగుల వృద్ధాశ్రమంలోని నారాయణులకు మధ్యాహ్న అన్న ప్రసాద వితరణ, అనాధలకు బెడ్ షీట్స్ పంపిణీ తో పాటు గో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజులు, పెళ్లి రోజులు, వర్ధంతులు ఆర్భాటాలు లేకుండా సమాజంలో ఉన్న అనాధలకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంధువులు తోట శ్రీనివాస్, లక్ష్మి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పబ్బతి వేణుమాధవ్,బిక్కుమళ్ళ కృష్ణ, వెంపటి శబరినాథ్ యామ సంతోష్ ,వెంపటి రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## పెరటి కోళ్ల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా చేసుకోవాలి

- శాస్త్రవేత్త ప్రశాంత్ కుమార్

**భీమదేవరపల్లి విశాలభారతి:** మండలంలోని పలు గ్రామాలలో గురువారం అఖిల భారత కోళ్ల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఆఫీసర్ ఇన్ ఛార్జ్ & హెడ్ డా. అమరేశ్వరి, శాస్త్రవేత్త డా. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, పెరటి కోళ్ల పెంపకంను ప్రజలు కుటీర పరిశ్రమగా చేసుకుని, వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. మామునూర్ పివిఎన్ఆర్ పశు, వైద్య విశ్వవిద్యాలయం, పశుపరిశోధన క్షేత్రం ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా, 30 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 4 వారాల వయసు గల 1200 పెరటి కోడి పిల్లలు, కోళ్ల గూడు, వాటికి కావలిసిన దాణా తొట్టెలు, నీటి తొట్టెలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పశు వైద్యాధికారి డా. మాలతి, డా. పార్థసారథి హాజరై మాట్లాడుతూ, ఈ ఉచిత కోళ్ల పంపిణీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.




## క్రమశిక్షణ ప్రతి ఒక్కరిని ఉన్నత స్థితికి చేరుస్తుంది

- జి. చెన్నకిషన్ రెడ్డి

**ఆమనగల్లు, విశాలభారతి:** ప్రతి విద్యార్థి భవిష్యత్తు కలలను ఎంచుకోవాలని అందుకు తగ్గ కృషి సాధనతో ఆ కలలను సాకారం చేసుకోవాలని ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ జి చెన్న కిషన్ రెడ్డి అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య ప్రతి ఒక్కరిని ఉన్నత స్థితికి చేరుస్తుందని అప్పుడు సమాజం నుండి మన్ననలు పొందుతారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కడ్తాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్స్ జామెంట్రీ బాక్స్ క్రేయాన్స్ లను అందజేశారు. కడ్తాల గ్రామానికి చెందిన ఎంపీటీసీ చేగూరి వెంకటేష్ మానవతా దృక్పథంతో విద్యార్థులకు ఈ సామాగ్రి సమకూర్చారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్, పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్త,చేగూరి వెంకటేష్, తో కలిసి చెన్న కిషన్ రెడ్డి అందజేశారు. సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి విద్యనభ్యసించాలని అంతేకాకుండా దేశభక్తి ,సమాజ శ్రేయస్సు , దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతను స్వీకరించాలని ఆయన సూచించారు. మహనీయుల చరిత్రలను తెలుసుకుంటూ, వారు సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు చెన్న కిషన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేష్ కోశాధికారి గుజ్జరి నరసింహ, గంప శ్రీను, హనుమ నాయక్, బిచ్య నాయక్, పిప్పళ్ళ వెంకటేష్, గుడిగళ్ల లక్ష్మయ్య, సత్యం, జహంగీర్, జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, లియో తరుణ్, శ్రీకాంత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజాక్ శ్యామ్మూర్తి లైన్స్ క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు ఉన్నారు.



## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**ఆమనగల్లు, విశాలభారతి :** క్రమశిక్షణతో చదివితే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఆశ్రమ పాఠశాల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్. గోపాల్ అన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఒక రోజు డిటిడిఓగా నందిని, ఏటిడిఓగా శిరీష, హెల్త్మాస్టర్ గా గీతాంజలి, హేచ్.డబ్ల్యూ.ఓగా శేనుక వ్యవహరించారు. సందర్భంగా ఒకరోజ గా వ్యవహరించిన విద్యార్థులు తమ వస్త్రధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పలు సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రక్రియ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విమల, జ్యోతి, కవిత, కీర్తి, అస్మా, శాంభవి, పద్మ, సంతోషి, లక్ష్మి, సునీత, స్వాతి పాల్గొన్నారు.

## విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్

- కొత్త ఆదాయ పన్ను బిల్లుకు ఆమోదం
- స్కిల్ ఇండియా కోసం రూ.8,800 కోట్లు
- పీఎం కౌశల యోజన్4.0కు రూ.6000 కోట్లు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర కేబినెట్ శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ సందర్భంగా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకొంది. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కానుంది. ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఈ కొత్త జోన్ ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేసింది. పోస్ట్ ఫ్యాక్టో కింద దీనికి అప్రూవల్ ఇచ్చినట్లు కేంద్రం ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం న్యూఢిల్లీలో వివరించారు. ఇక స్కిల్ ఇండియా కోసం రూ.8,800 కోట్లు, పీఎం కౌశల్ వికాస్ యోజన 4.0కి రూ.6000 కోట్లు, జన్ శిక్షణ్ సంస్థాన్‌కు రూ.858 కోట్లు విడుదలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

**కొత్త ఆదాయ పన్ను చట్టం..**

ప్రస్తుతం అమలులో ఉన్న ఎప్పటిదో ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువస్తామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనికి సంబంధించిన బిల్లుకు ఈరోజు ప్రధాని మోదీ అధ్యక్షత జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. వచ్చే వారం పార్లమెంటు ముందు ఈ బిల్లు రానుంది. దాని తరువాత దీన్ని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి పంపించనున్నారు.

## మరో 487 మంది భారతీయులపై బహిష్కరణ వేటు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** అమెరికాలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే 104 మంది భారతీయులకు సంకెళ్లు వేసి సైనిక విమానంలో అమృత్‌సర్‌కు పంపిన ట్రంప్ సర్కారు.. తాజాగా మరికొందరు భారతీయులను వెనక్కి పంపేందుకు సిద్ధమవుతున్నది. ప్రస్తుతం అక్కడ 487 మంది భారతీయులు డిపోర్టేషన్ ముప్పును ఎదుర్కొంటున్నారని, వారంతా తుది జాబితాలో ఉన్నట్టు అమెరికా ప్రభుత్వం భారత్‌కు తెలియజేసిందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అమెరికాకు అక్రమంగా వలస వెళ్లినట్టు గుర్తించిన భారతీయులను సురక్షితంగా, గౌరవప్రదంగా భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.అక్రమ వలసదారులను వెనక్కి పంపుతున్న అమెరికా ఆ క్రమంలో వారికి సంకెళ్లు వేస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. భారతీయుల పట్ల ఈ అవమానకరమైన చర్యలు నిలువరించడానికి మోడీ ప్రభుత్వం ఏం చేయబోతోందని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. విదేశాంగ శాఖ.. ఈసారి సంకెళ్లు వేయకుండా తీసుకురావాలని అమెరికాకు విజ్ఞప్తి చేసిందని జాతీయ మీడియా పేర్కొంది. అక్కడి అధికారులు అంగీకరించారా..! లేదా..! అనే దానిపై స్పష్టత లేదు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
08.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## మున్సిపల్ కమిషనర్ కు ఘన సన్మానం



**ఆమనగల్లు, విశాలభారతి :**
ఆమనగల్లు మున్సిపాలిటీ నూతన మున్సిపల్ కమిషనర్ గా ఇటీవలే శంకర్ నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు మాజీ కౌన్సిలర్లు రాధమ్మ వెంకటయ్య, సోనీ జయరాం నాయక్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శంకర్ నాయక్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలనీ, పదవి ఉన్న లేకున్నా తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వారు అన్నారు.





## కూలీల సమస్యను పరిష్కరించడానికి
# అధికారులు చొరవ చూపాలి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపందా) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ మధుసూదన్ రెడ్డి

**పినపాక, విశాలభారతి :**
వ్యవసాయ కూలీల న్యాయమైన సమస్యను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపందా) మణుగూరు డివిజన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. మధుసూదన్ రెడ్డి అధికారులను కోరారు. రోజు ఇచ్చే కూలీలో కోత విధించవద్దని ఏడూళ్ల బయ్యారం, ఎల్సిరెడ్డిపల్లి తదితర గ్రామాల వ్యవసాయ కూలీలు నిర్వహిస్తున్న ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శుక్రవారం వ్యవసాయ కూలీల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు రోజు కూలీ 300 రూపాయలు రైతులు చెల్లించే వారని, ఇప్పటి వరకు రైతులు, కూలీలు సమన్వయంతో పని చేసుకునేవారని అన్నారు. వేరే గ్రామాల నుండి మరియు వలస ఆదివాసీలను పోటీగా తీసుకొని వచ్చి 250 రూపాయలు మాత్రమే చెల్లిస్తామని అనడంతో స్థానిక వ్యవసాయ కూలీలల్లో ఆందోళన మొదలైందని అన్నారు. రెక్కలు తప్ప వేరే ఆస్తులు లేని వ్యవసాయ కూలీలు ఈరోజు ఉన్న నిత్యవసర సరుకుల ధరల దృష్ట్యా 250 రూపాయలతో ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు.




## నూతనకల్ మండల సమగ్ర అభివృద్ధికై పోరాడుదాం

- ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య

**నూతనకల్, విశాలభారతి:**
ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన నూతనకల్ మండల అభివృద్ధికి తోడ్పడతాయని మండల ప్రజలు ఎంత ఆశించినా గానీ ఫలితాలు మాత్రం నిరాశే మిగిల్చాయని ఐఎఫ్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. ఈ సందర్భంగా గంట నాగయ్య పాల్గొని మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీలు అభివృద్ధి గురించి గొప్పలు చెప్పిన వారు ఆచరణలో ఒక్క అడుగు ముందుకు వేయడం లేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని ప్రభుత్వాలను దుయ్యబట్టారు. ఇతర మండలాలతో పోల్చుకుంటే నూతనకల్ మండలం అభివృద్ధిలో చాలా వెనుకబడిందని వారు అన్నారు. గత ప్రభుత్వంలో మండలం అభివృద్ధి జరగలేదని మండల ప్రజలు అధిక మొత్తంలో కాంగ్రెస్ కు ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా కానీ మండల ప్రజల సమస్యలు అదేవిధంగా ఉన్నాయన్నారు. మండలంలో జన్నారెడ్డి ప్రతాపరెడ్డి వారసుల భూములకు సుమారు 1680 ఎకరాలు భూములను పేద ప్రజలకు పట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ కాలువలను మెరుగుపరిచి మండల చివరి ఆయకట్ట వరకు నీరందించాలన్నారు.





## బలహీన వర్గాలకై పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి సర్దార్ పాపన్న గౌడ్

- పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీ
- 10 రోజులలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మార్కెట్ చైర్మన్ గిరిధర్ రెడ్డి
- పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు రెండు లక్షల యాభైవేలు అందజేత





**నూతనకల్ ,విశాలభారతి:**
మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి సర్దార్ పాపన్న గౌడ్ వారి పోరాట స్ఫూర్తిని మనం ఆదర్శంగా తీసుకోవాలని,ఆయన ఆశయ సాధనకోసం అందరం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన పోరాట స్ఫూర్తి ని మనం అలవర్చుకోవాలని సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ పోరాట చరిత్రను,వారసత్వాన్ని ముందు తరాలకు, అందించే ప్రయత్నం చేయాలని చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో బండపల్లి శ్రీను,మొగుళ్ళ శ్రీరాములు,మారగాని వెంకటాచలం, బూడిద మల్లయ్య, మద్దెల సురేందర్ బండపల్లి బుచ్చి రాములు, బండపల్లి సాయిలు,బండపల్లి లింగయ్య(పోస్ట్) కనుకటి యాదగిరి, మారగని వెంకన్న గౌడ్ బండపల్లి యాదగిరి, బండపల్లి సాగర్, మొగుళ్ల రవి , మొగుళ్ళ వెంకన్న, పూజల కోటయ్య,కొత్వలా ఉప్పలయ్య, ముత్యం ప్రసాద్,బత్తిని లింగయ్య, బత్తిని నారాయణ, భూపతి వెంకన్న అండెం శ్రీరాములు బత్తిని లక్ష్మయ్య, బూడిద శ్రీనివాస్ బండపల్లి మహేష్ , బండపల్లి చంద్రు, బండపల్లి సంపత్ బూడిద శ్రీకాంత్, బండపల్లి జలంధర్ మారగని రమేష్ బండి మహేష్, బండి అనిల్,బత్తిని కళ్యాణ్ ,గౌడ సంఘం సభ్యులు, యూత్ సభ్యులు, మహిళాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## నవాబ్ పేట రిజర్వాయర్ ను
# సందర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**దేవరుప్పల, విశాలభారతి:**
పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి లింగాల ఘనపురం మండలం, నవాబుపేట రిజర్వాయర్‌ను సందర్శించి, రిజర్వాయర్ నుండి పాలకుర్తి నియోజక వర్గంలోని దేవరుప్పల, పాలకుర్తి మండలాలకు సంబంధించిన గ్రామాలకు సాగు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, చరవాణిలో అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సింగరాజుపల్లి, పెద్దమడూరు చిన్నమడూరు 4ఎల్ కెనాల్స్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. కెనాల్ లలో నిర్వహణ పనులు త్వరగా పూర్తి చేయడం ద్వారా రైతులకు సాగు నీరు సకాలంలో అందుతుందని, ఇది పంటల ఉత్పాదకతను పెంపొందించడంలో సహాయపడుతుందని, అదనంగా కెనాల్స్ నిర్వహణతో నీటి నష్టం తగ్గి, నీటి వనరుల సమర్థవంతమైన వినియోగం సాధ్యమవుతుందని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ చర్యలు ఆ దిశలో ముందడుగు అని, అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చరవాణిలో ఆదేశించారు. రైతులు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటిని పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట దేవరుప్పుల మండల, సింగరాజు పల్లి గ్రామ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, రైతులు, తదితరులున్నారు.



## అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న
# గుత్తెంధార్‌పై అఖిలపక్షం ఫిర్యాదు

**వాజేడు, విశాలభారతి:**
మండల కేంద్రం వాజేడు రెవిన్యూ పరిధిలోని అక్రమ గ్రావెల్ రవాణా జరుగుతున్న సంబంధిత మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని అఖిల పక్షం కాంగ్రెస్, బిఆర్ఎస్ ,సిపిఎం) ఫిర్యాదు చేసింది. వాజేడు నుండి ఏటూరు నాగారం మండలానికి అక్రమంగా గ్రావెల్ రవాణా గత రెండు రోజుల నుండి జరుగుతుంది. వాజేడు రెవిన్యూ సర్వేనెంబర్ 14/3 ,34/2, 1/4, 2/5, రెవిన్యూ, మైనింగ్ డిపార్ట్మెంట్ గ్రావెల్ పర్మిషన్ తీసుకొని, సదరు గుత్తిందారు వాజేడ్ రెవెన్యూ డిపార్ట్మెంట్ సూచించిన జియో క్వారీ ఆర్డినేటర్ పరిధి దాటి అక్రమంగా మా వాజేడు మండలం నుండి ఏటూరు నాగారం మండలానికి అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అఖిలపక్షం ఫిర్యాదు చేసినారు. సంబంధిత రెవిన్యూ అధికారులు స్పందించి వెంటనే అక్రమ గ్రావెల్ రవాణా చేస్తున్న వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల ములుగు జిల్లా ఇన్చార్జిమంత్రికి మరియు సంబంధిత జిల్లామైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, బి ఆర్ ఎస్ వాజేడు మండల అధ్యక్షులు రామ కృష్ణారెడ్డి, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి, దామోదర్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



## పార్లమెంట్ భవనాన్ని
# సందర్శించిన మాజీ ఎంపీటీసీ

**బాల్కొండ, విశాలభారతి:**
భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామం మాజీ ఎంపీటీసీ ఆరే రవీందర్,బీజేపీ సీనియర్ కార్యకర్తలతో కలిసి ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ఏడి టీమ్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు.ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గత 15 రోజుల నుంచి ఢిల్లీకి వెళ్లి ప్రచారం చేస్తున్న నాయకులు అందరితో కలిసి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పార్లమెంటు భవనంలో లైవ్ పార్లమెంట్ సెషన్ నీ వారికి చూపించారు.పార్లమెంటు భవనం చుట్టూ కలియతిరిగి అక్కడ ఉన్న స్థానిక కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్,భూపెందర్ యాదవ్,రామ్మోహన్ నాయుడు లను ఏడి టీమ్ సభ్యులకు పరిచయం చేశారు.పార్లమెంట్ భవనం చూపిస్తూ పార్లమెంటులో జరిగే సమావేశాల గురించి సభ్యులకు వివరిస్తూ సమావేశాలను చూపించడం జరిగిందని మాజీ ఎంపిటిసి ఆరె రవీందర్ తెలిపారు.

## ఉత్తమ విద్య అందించడమే
# పిఆర్ ఆర్ ఫౌండేషన్ లక్ష్యం

**మునుగోడు, విశాలభారతి:**
మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యలయం లో శుక్రవారం పి ఆర్ ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకొని కష్టపడి ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు విద్యార్థుల భవిష్యత్తు ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగరావు అన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు



**ఆమనగల్లు, విశాలభారతి:**
వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ ప్రమోద్ కుమార్ చెప్పారు. శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. వాహనదారులు లైసెన్సు లేకుండా నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, రంగు, రూపు మార్చిన వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని చెప్పారు. మద్యం తాగివాహనాలు నడపవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
08.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## ముగిసిన 4 రోజుల వీడియో ఎడిటింగ్ బూట్‌క్యాంప్ శిక్షణ

**విశాలభారతి,ఓయూ:**

ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (HCDC) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4 నుంచి 7, 2025 వరకు "నాలుగు రోజుల వీడియో ఎడిటింగ్ బూట్‌క్యాంప్" ను విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం HCDC కార్యాలయం లో నిర్వహించారు. క్యాంపస్‌లోని ఈ క్లాస్ రూమ్ లో ప్రతి రోజు ఉదయం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. శుక్రవారం నాటి ముగింపు ఈ కార్యక్రమానికి ఓయూ కామర్స్ & బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఐ. శేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.యచ్ సి డి సి డైరెక్టర్ ప్రొ. సి.వి. రంజని, సమన్వయకర్త డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి ఈ శిక్షణా కార్యక్రమాన్ని నడిపించారు. వర్సిటీ క్యాంపస్, అనుబంధ కళాశాలల నుండి వచ్చిన పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణ శిబిరంలో ఎస్. వెంకట్, శ్రీమతి వి. అనామిక ల్ - వీడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్, ప్రాథమిక సాధనాల పరిచయం పై,
వి. అనామిక - కటింగ్, ట్రిమ్మింగ్, ట్రాన్సిషన్లు, కథన సరళిని మెరుగుపరిచే ఎడిటింగ్ పద్ధతుల పై, శ్రీ రామ్ మోహన్, వి. అనామిక - విజువల్ ఎఫెక్ట్స్, కలర్ గ్రేడింగ్. ఎస్. వెంకట్ - విద్యార్థులు ఒక ప్రాజెక్ట్‌ను రూపొందించి, ఎక్స్‌పోర్టింగ్, రెండరింగ్ ఉత్తమ పద్ధతుల పై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఐ. శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని అభినందిస్తూ, వీడియో ఎడిటింగ్ విద్యార్థులకు ప్రొఫెషనల్, పర్సనల్ ప్రాజెక్టులకు ఉపయోగపడే కీలకమైన నైపుణ్యం అని తెలిపారు. ప్రొ. సి.వి. రంజని, డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి వీడియో ఎడిటింగ్ ఇంటర్న్‌షిప్‌లు మరియు పూర్తి స్థాయి ఉద్యోగ అవకాశాలకు మార్గదర్శిగా నిలుస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమం విద్యార్థుల అభిప్రాయ సేకరణ, సర్టిఫికేట్‌ల పంపిణీతో విజయవంతంగా ముగిసింది.

## పిడియస్ బియ్యం పట్టివేత



**బాల్కొండ, విశాలభారతి:**

అక్రమంగా తరలిస్తున్న పిడియస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెండోరా ఎస్సై జి.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం అర్ధరాత్రి జగిత్యాల్ నుండి మహారాష్ట్రకు టాటా 207 వాహనంలో 38 క్వింటళ్ల పిడియస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారననే సమాచారం రావడంతో కోడిచర్ల గ్రామ సమీపంలో సిబ్బందితో కలిసి పిడియస్ బియ్యాన్ని పట్టుకొని సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్‌కు అప్పగించి,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





# కొల్లూరు డబుల్ బెడ్రూంలలో అన్ని రకాల వసతులు కల్పించాలి

- **సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**
- **నూతన పట్టణాన్ని తలపించేలా 2 బిహెచ్ కె కాలనీలో వసతులు కల్పించాలి**
- **కాలనీలో 7258 కుటుంబాలకు చెందిన 30 వేల జనాభా**

**పటాన్ చెరు,విశాలభారతి**

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు టు బిహెచ్ కెలో అన్ని రకాల వసతులు కల్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రామచంద్రాపురం మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు టు బిహెచ్ కె కాలనీలో, కాలనీ ప్రజలు, జిహెచ్ఎంసి అధికారులు, విద్యాశాఖ, సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కాలనీలో ఇప్పటివరకు 7258 కుటుంబాలకు చెందిన సుమారు 30 వేలకు పైగా జనాభా నివసిస్తున్నట్లు తెలిపారు. ఇంకో 30 వేల మంది జనాభా కాలనీకి వచ్చే అవకాశం ఉందన్నారు. కాలనీలో పట్టణాన్ని తలపించేలా అన్ని రకాల వసతులు కల్పించాలని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రము, తాగునీటి వసతి, మురుగునీటి పారుదల వ్యవస్థ,లిఫ్ట్ మరమ్మత్తులు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు,బస్సు సౌకర్యం, టెలి కమ్యూనికేషన్స్ సౌకర్యం, రేషన్ దుకాణం, పోలీస్ సెక్యూరిటీ తదితర అన్ని రకాల సౌకర్యాలు కాలనీలో ఏర్పాటు అయ్యేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. కొల్లూరు ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఈ సందర్భంగా చర్చించారు. కొల్లూరు టు బిహెచ్ కె కాలనీలో మరింత ఎక్కువ మంది ప్రజలు స్థిరపడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో గ్రామంలో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రస్తుత అవసరాలకు సరిపోవని ఈ నేపథ్యంలో గ్రామానికి మానవీయమైన, సాంకేతిక మౌలిక సదుపాయాలు గురించి వచ్చిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కాలనీలో నివసించే కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రాథమిక విద్య అనేది చాలా కీలకమైనదని, దీని ఇందుకోసం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉన్నత పాఠశాల కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీలో అంగన్వాడీ కేంద్రము, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, జనాభా సంఖ్య కనుగుణంగా ఆశా కార్యకర్తలను, ఏఎన్ఎం లను సబ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. టు బిహెచ్ కె కాలనీలో తాగునీటి వసతి మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాలనీలోని ప్రతి నివాస గృహానికి తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న తాగునీటి వసతి వ్యవస్థకు అదనంగా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాలనీలోని వివిధ టవర్లలో లిఫ్ట్ వ్యవస్థలు మరమ్మత్తులకు చేపట్టాలన్నారు. లిఫ్ట్ లలో సమస్య తెలిసేలా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. పెద్ద మొత్తంలో కొల్లూరు టు బిహెచ్ కెలో ప్రజలు నివసించే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుపై ఇంజనీర్లు దృష్టిసారించాల్సినా అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే నిధులు మంజూరయ్యాయి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాలనీలోని ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎక్కువగా రాకపోకలు సాగించే విధంగా అవసరమైన రూట్లో బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. కాలనీ ప్రజలకు మెరుగైన టెలికమ్యూనికేషన్స్ సేవలు అందించేలా ప్రభుత్వ ప్రైవేటు రంగాల ద్వారా సెల్ టవర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేలా బిఎస్ఎన్ఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని. కలెక్టర్ బిఎస్ఎన్ఎల్ అధికారులకు సూచించారు. కాలనీ ప్రజలకు అందరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని వారికి ప్రతి నెల రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు సరఫరా చేసే విధంగా కుటుంబాల సంఖ్య జనాభా సంఖ్య ఆధారంగా ఎన్ని రేషన్ దుకాణాలు అవసరము ఆయన అన్ని రేషన్ దుకాణాలు ఏర్పాటయ్యాలా చూడాలని కాలనీలో నివసించే వారికే నూతన రేషన్ డీలర్ షిప్లు మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీవాసులకు రక్షణ కల్పించడం కోసం పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. రాత్రి సమయాలలో దొంగతనాలు జరగకుండా నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ జరిగేలా అవసరమైన పోలీస్ సిబ్బంది నియమించాలని పోలీస్ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. కాలనీలో లో వోల్టేజ్ సమస్యలు ఎత్తకుండా అవసరమైన పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్కో అధికారులకు కలెక్టర్ సూచించారు. జిహెచ్ఎంసి రెవెన్యూ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఈ ప్రజల సమస్యలను సత్వారం పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. శాఖల మధ్య సంబంధాలు సజావుగా ఉండాలని అప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయి అన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైన అభివృద్ధి పనుల నిర్మాణం కోసం త్వరతగతన నిధులు మంజూరు ఎలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, రామచంద్రాపురం తహశీల్దార్ సంగ్రామ్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు, సంబంధిత అధికారులు, కాలనీ ప్రజలు, ఆయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సమస్యలపై శ్రీరాం నగర్ వాసుల సమావేశం

- **పుట్ పాత్ లో అక్రమ పార్కింగ్**
- **చిరు వ్యాపారులు అక్రమ దుకాణాల పై చర్చ**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీల్లోని ఏ బి సి బ్లాకుల్లో నిర్వహిస్తున్న వివిధ హాస్టళ్ళ భావన యజమానులు,చిరు వ్యాపారులు అక్రమ దుకాణాలపై ఆయా కాలనీలో నివాసముంటున్న అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు.ఈ మేరకు కాలనీలోని అంతర్గత రహదారుల్లో అక్రమంగా వాహనాలు నిలుపుతూ స్థానికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసుల అసోసియేషన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా శ్రీరామ్నగర్ నుంచి బొటానికల్ గార్డెన్ వెళ్లే దారిలో రోడ్డు ఇరువైపులా చిరు వ్యాపారులు అక్రమంగా షెడ్లు వివిధ షాపులను నిర్వహిస్తూ ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తున్నారని వీటిపై అందరూ ఏకతాటిపై సమస్యల కొరకు ముందుకు రావాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి వారి వ్యాపారాలు నిర్వహించుకోవాలని సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయా అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులు,సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## బీరంగూడ గుట్ట ఆలయ నూతన కమిటీ సభ్యులను సన్మానించిన "కాట దంపతులు

**పటాన్ చెరు,విశాలభారతి**

అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా దేవాలయ కమిటీ ఛైర్మన్ బి.సుధాకర్ యాదవ్, డైరెక్టర్లను కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్ దంపతులు ఘనంగా సన్మానించారు. ఛైర్మన్ సుధాకర్ తో పాటు డైరెక్టర్లు అరుణ దేవి, నిమ్మలదండు శ్రీలత, ఆశగారి లక్ష్మణ్, చెన్నపల్లి చంద్రశేఖర్, గోక మైపాల్ రెడ్డి, కుమ్మరి మహేష్ కుమార్, కుంచం ఎల్లయ్య, అల్వర్తి మల్లేష్, తొర్తి లక్ష్మీకాంత్ రావు, బోయిని పెద్దులు, జనుముల శ్రీనివాస్, దీపక్ గౌడ్, గొల్ల మల్లేష్ లకు శాలువాలను కప్పి సత్కరించారు. నూతనంగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

- **కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు**
- **బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి**



ఇబ్రహీంపట్నం మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నేడు ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని శాస్త్ర గార్డెన్ లో జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ,మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ , మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. ఈ సమావేశానికి కార్యకర్తలు , పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# పద్మారావుపై అదం ఫైర్

- **విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంతోష్ కుమార్**

**సికింద్రాబాద్,విశాలభారతి :**

పద్మారావు వ్యాఖ్యలపై సికింద్రాబాద్ కంటేస్టేడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడమ్ సంతోష్ కుమార్ మండిపడ్డారు.పద్మారావు వాడిన భాష బాగాలేదు ఎవరి బొక్కలు విరగకొడ్తావ్ ? నియోజకవర్గంలో రౌడియిజం చేస్తున్నావా? 2001లో కాంగ్రెస్ బి ఫార్మ్ మీద కార్పొరేటర్ గా గెలిచి ఈరోజు కాంగ్రెస్ కార్యకర్తల బొక్కలు విరగకొడ్తావా ? 2004 లో సికింద్రాబాద్ ప్రజలకు పద్మారావు ఎవరో తెలియదు.. 2004 లో కాంగ్రెస్ పార్టీ పొత్తు తోనే ఎమ్మెల్యే గా గెలిచావు సికింద్రాబాద్ లో ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారం చేసి పరిచయం చేసింది మా ఆడమ్ ఫ్యామిలీ. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న చెక్కులను నువ్వు పంచుతున్నావు... మీ కొడుకులకు ఎం అధికారముంది అని ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటున్నారు... ఎమ్మెల్యేగా గెలిసాక 6 నెలల్లో వచ్చిన ఎంపీ ఎలక్షన్స్ లో డిపాసిట్ రాలేదు. మూడో ప్లేస్ కి పడిపోయావు అని అన్నారు. పదిఏండ్ల కాలంలో సికింద్రాబాద్ నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధి చేయలేదు. చెక్కులు పంచుతామని మేము ఎక్కడ అడగలేదు.. ప్రోటోకాల్ విషయం లో మేము ఎలాంటి అభ్యంతరాలు తెలపడం లేదని పేర్కొన్నారు. మైనారిటీ లకు ప్రాధాన్యత ఇస్తున్నాము, పలు నామినేటెడ్ పోస్టులు రాబోయే కాలంలో కార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం ఇస్తామని కాంగ్రెస్ కార్యకర్త మీద గీత పడిన మా ఆడమ్ ఫామిలీ అంటే ఎంటో చూపిస్తామని హెచ్చరించారు



## చికెన్ సెంటర్ లపై నోటీసులు జారీ చేయని కార్యదర్శులను సస్పెండ్ చేయాలి

- **బయ్యారం మండలంలో అనధికారిక చికెన్ షాపుల కలుష్య ప్రభావం**
- **పిడిఎస్యు జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్**

**డోర్నకల్, విశాలభారతి:**

బయ్యారం మండల కేంద్రంలో అనధికారికంగా వ్యాపారం నిర్వహిస్తూ, కోళ్ల వ్యర్థాలను నిర్దిష్ట నియమనిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై పారవేస్తున్న చికెన్ షాపులను వెంటనే సీజ్ చేయాలని దేవేందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిపై చెత్తగా మారుతున్న కోళ్ల వ్యర్థాలు ప్రస్తుతం బయ్యారం నుండి మహబూబాబాద్ వెళ్లే ప్రధాన రహదారి, ముఖ్యంగా బయ్యారం బ్రిడ్జి సమీపం, చికెన్ వ్యర్థాల కలుష్యంతో తీవ్ర సమస్యను ఎదుర్కొంటోంది. అనేక చికెన్ సెంటర్లు వ్యర్థాలను తగిన విధంగా నిర్వహించకుండా, నిర్లక్ష్యంగా రహదారిపై పారవేయడంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వ్యాపిస్తోంది. దీనివల్ల ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. వర్షాకాలంలో ఈ వ్యర్థాలు నీటిలో కలిసిపడి తీవ్ర పారిశుద్ధ్య సమస్యలకు దారితీస్తాయి. పర్యావరణం కలుషితం కావడంతో పాటు, రోడ్లపై తేమ పెరిగి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. స్థానిక ప్రజలు దీని వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజలు మాత్రమే కాకుండా, వాహనదారులు కూడా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. రోడ్లపై వ్యర్థాల కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరుగుతున్నాయి సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు, ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.




# పసిపిల్లల ప్రాణాలు లెక్క చేయని విద్యాసంస్థలు

- శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వద్ద విద్యార్థి నాయకుల ధర్నా
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్కూల్ యాజమాన్యం పై నుండి పడ్డ కార్పొరేటర్.
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ నందు అనుమగల్ లో ఉన్నటువంటి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లో UKG చదువుతున్న రూత్విక అనే పాప స్కూల్ కు రోజు వారులాగే 6వ తేదిన ఆటో లో ఇంటికి వెళ్లిన పాప ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిందని సమాచారం రావడంతో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అక్కడికి చేరుకునే ఘటనకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకు న్నారు,రూత్విక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే పాప చనిపోవడం జరిగిందని,డ్రైవర్ రూత్విక ఆటో దిగిన తర్వాత వెనక నించోవడం గమ నించక ఆటో వెనక్కి ఒకే సారి తీయడం తో రూత్విక పై ఆటో ఎక్కి పాప అక్కడికక్కడే చనిపోవడం జరిగిందని, కనీసం తల్లిదండ్రు లు సమాచారం ఇవ్వకుండానే ఆటో డ్రైవర్ పాపను హాస్పిటల్ తీసుకెళ్లాడని, పాప చనిపోయి దాదాపు 34గా గడుస్తున్నప్పటికీ ఆ రోజు సాయంత్రం వరకు స్కూల్ సిబ్బంది గానీ , స్కూల్ యాజమాన్యం గానీ కనీస బా ధ్యతగా పాపని చూడటానికి కూడా రాలేదని వారు తెలపడం తో కార్పొరేటర్ రూత్విక తల్లిదండ్రులకు అండగా ఆటో డ్రైవర్ నిర్ల క్ష్యం మరియు ఫిట్ నెస్ లేని వాహనాలను, నైపుణ్యం లేని డ్రైవర్లను విధులోకి తీసుకొని పిల్లల ప్రాణాలు అంటే లెక్కచేయని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఎదుట ఆందోళనలకు దిగడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరే టర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధం గా ఇష్టానుసారంగా శ్రీ చైతన్య విద్యాసం స్థలు లాంటి ఎన్నో ప్రైవేట్ విద్యాసంస్థలు ఒక్క చోట మాత్రమే ప్రభుత్వం గుర్తింపు తీసుకొని చాలాచోట్ల అక్రమంగా విద్యా సంస్థలు నడుపుతున్నారని ప్రస్తుతం హయత్ నగర్ లో ఉన్నటువంటి ఈ శ్రీ చైతన్య టెక్నో స్కూల్ కి కూడా ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు లేదని, పసిపిల్లల ప్రాణాలు అంటే లెక్క చేయని విద్యా సంస్థలు నడుపుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నిం చారు, రూత్విక కుటుంబానికి న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ పోరా డుతుందని వారు తెలిపారు, ఈ కార్యక్రమం లో భారతీయ జనతా పార్టీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను, మరియు స్థానిక నాయకులు రూత్విక కుటుంబానికి అండగా నిలవడం జరిగింది తెలిపారు

## శిథిలావస్థకు చేరిన పాఠశాల వంటగది

**ఆమనగల్లు, విశాలభారతి:**

తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యా ర్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసే వంటగది శిథిలావస్థకు చేరుకున్న పట్టించుకునే నాథులే లేరు. గదిపైన రేకులు పగిలిపోయి కింద ఫ్లోరింగ్ లేక కూరగాయలు కోసే సమయంలో మట్టి వంటలలో కి చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు, ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు చెప్పారు. వెంటనే ప్రభుత్వం నూతన గదిని నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు.



# పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేస్తా

- టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్.

**ఎల్బీనగర్ ,విశాలభారతి:**

గత బిఆర్ఎస్ పాలనలో ఎల్బీనగర్ నియోజక వర్గంలో ఎమ్మెల్యే, అతని అనుచరులు అధికా రులతో కుమ్మక్కై చెరువులు, కుంటలు, అసైన్డ్ స్థలాలను కబ్జా చేశారని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆరోపించారు. అంతేకాకుండా అక్రమ నిర్మా ణాలను, అనుమతులు లేకుండా సెల్లార్లతో భారీ నిర్మాణాలను ప్రోత్సహించారని ఆయన విమర్శించారు. అధికారులు ఇప్పటికీ గత ప్రభుత్వ నేతల మాటలే వింటూ అక్రమాల ను ప్రోత్సహిస్తున్నారని, అలాంటి వారిపై కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించా రు. నియోజకవర్గంలోని పలు కాలనీలలో మధుయాష్కీ గౌడ్ పర్యటించారు. సమస్యల ను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ నిర్మాణాలతో సెల్లార్ల గుంతలు తీసి సామాన్యుల ప్రాణాలను తీస్తు న్నారని, ఇందుకు ఎల్బీనగర్లో రెండు రోజుల కింద జరిగిన సెల్లార్ గోడ కూలి ముగ్గురు మరణించిన ఘటనే నిదర్శనం అన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించా లని అధికారులను హెచ్చరించారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేస్తానని, ఎల్బీనగర్ నియోజక వర్గాన్ని ఆదర్శ నియో జకవర్గం గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.



**గ్రంథాలయం పరిశీలన...**

వనస్థలిపురంలోని శాఖా గ్రంథాలయాన్ని మధుయాష్కీ సందర్శించారు. ఇప్పటికే రూ. 1.50 కోట్ల నిధులు మంజూరు అయినప్పటికీ కొందరు పనులు ప్రారంభించకుండా అడ్డు కుంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. స్పం దించిన మధుయాస్కి త్వరలోనే మంత్రి శ్రీధర్ బాబుతో శంకుస్థాపన చేయిస్తానని పేర్కొన్నా రు. అంతేకాకుండా శాఖా గ్రంథాలయం, ఎన్జీవోస్ కాలనీ హౌసింగ్ సొసైటీ, ఎన్జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం, రంగ స్థల కళాకా రుల అభిమాన సమాఖ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అందరూ కలిసి ఎక్కడె క్కడ భవనాలు నిర్మించాలో ఏకాభిప్రాయం తో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వారు తీసుకునే నిర్ణయంతో ఆయా భవనా లను డిజైన్ చేసి.. నిధులు మంజూరు చేయి స్తామన్నారు.ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్ నేలపాటి రామారావు, బుడ్డా సత్య నారాయణ, నాయకులు బద్రీనాథ్, దుర్గారెడ్డి, సాయి నికేష్, ఓరుగంటి వెంకటేష్, సామామ హేశ్వర్ రెడ్డి, సురేందర్, కిరణ్, కవిత, భాను తదితరులు పాల్గొన్నారు.




## లయోలా మోడల్ స్కూల్ ముందు
# ధర్నాకు దిగిన విద్యార్థి సంఘం నేతలు

- కీచక ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి
- పాఠశాల గుర్తింపు రద్దుచేయాలని డిమాండ్
- పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య తోపులాట
- విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలింపు
- ప్రిన్సిపాల్ దినవన్ రావ్ పై పోక్సో కేసు నమోదు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రిన్సిపల్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్ప డిన ఘటన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీసులు నిందితుడిపై పోక్సో కేసును నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఎఫ్ఐ , ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్, డిఈఓ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు ఒక్క సారిగా పాఠశాలలకు తోసుకుపోయే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసు లకు విద్యార్థి సంఘం నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. చివరకు నాయ కులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కా ర్యదర్శి బాయికాడి శంకర్ మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థినిలపై కీచక పర్వానికి పాల్పడితే వారికి రక్షణ ఎక్కడ ఉటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా సదరు బాధిత విద్యార్థిని తల్లిదం డ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పరి స్థితిని కల్పించాలని మండిపడ్డారు. ఓవైపు విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంద న్నారు. ఇప్పటికైనా లయోలా పాఠశాల గు ర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్న కేసును కప్పిపుచ్చుతున్నారని ప్రశ్నించారు.

## బైరామాల గూడ చెరువు వరకు పనులు చేపట్టాలి

- కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్

**ఎల్బీనగర్ ,విశాలభారతి :**

ఎస్ఎన్ డి పి నిధులతో మంజూరైన నాలా పనులను వెంటనే చేపట్టాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను కోరినట్లు హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. శుక్ర వారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఎస్ ఎన్ డి పి నిధులు 12:30 కోట్లు మంజూరయ్యావని ఏపీఎస్ సి బి కాలనీ నుండి బైరామాల గూడ చెరువు వరకు పనులు చేపట్టాలని కోరారు. వర్షాకా లం రాకముందే పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల వారు వరద నీటితో ఇబ్బందులు పడరని వెంటనే ఆ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే ఆ పనులు ప్రారంభించే విధంగా చొరవ తీసు కుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతోపాటు డివిజన్లో పలు సమస్యలను పరిష్కరించే విధంగా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.





# జీవితంలో రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానం అవసరం


- ఓయూ వీసీ
- ఘనంగా ముగిసిన EMRC సెమినార్

**విశాలభారతి,ఓయూ :**

ఆధునిక యుగంలో రాణించాలంటే సాం కేతకతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకో వాల్సిందేనని ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం అన్నారు. సీఈసీ సహకారంతో ఎడ్యుకేషనల్ డిజిటల్ ఫ్రాంటియర్, మాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సెస్ (మూక్స్) రూపకల్పనపై ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎమ్మార్సీ), ఓయూ నిర్వహించిన రెండు రోజుల జాతీయ సెమినార్ శుక్రవారం రాత్రి ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భవిష్యత్తు విద్యా విధానంలో అనూహ్య మార్పులు తథ్యమన్న ప్రొ. కుమార్. అందుకు అనుగుణంగా సాం కేతికతను నేర్చుకున్న వాళ్లే రాణిస్తారని గుర్తు చేశారు. ఈఎమ్మార్సీ, సీఈసీ రూపొందిస్తు న్న మాసివ్ ఆన్లైన్ కోర్సెస్ లో అధ్యాపకులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తో పాటు దేశ వ్యా ప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అధ్యాపకులు ఈ కార్యశాలలో పాల్గొనటం వారికి సాంకేతి కత అందిపుచ్చుకోవటం పట్ల ఉన్న ఆసక్తికి నిదర్శనమని అన్నారు. అధ్యాపకుల నైపుణ్యా లను ఎప్పటికప్పుడు మెరుగుపరిచేందుకు అవసరైన చర్యలు తీసుకునేందుకు ఓయూ సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. రెండు రోజుల కార్యశాలలో పాల్గొన్న 150 మందికి పైగా అధ్యాపకులు రోజువారీ పాఠ్య బోధనలో సాంకేతితను జోడించాలని సీఈసీ డైరెక్టర్ ప్రొ. జగత్ భూషణ్ నడ్డా సూచించారు. అధ్యాపకులు కనబరిచిన ఆసక్తి పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మరిన్ని కోర్సులు ఈఎమ్మార్సీ ద్వారా చేయాలన అధ్యాపకు లకు సూచించారు. అత్యంత క్రమశిక్షణతో కార్యశాలను నిర్వహించిన ఈఎమ్మాఆర్సీ సి బ్బందిని అభినందించారు. కార్యక్రమంలో Emrc డైరెక్టర్ రఘుపతి, ఉద్యోగులు,విద్యా ర్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్ద అంబర్పేట్ లోని నిధి కన్వెన్షన్ హాల్ లో జరిగిన యాదగిరిగుట్ట వాస్తవ్యులు ఈమ్మడి రామచంద్ర రెడ్డి కుమారుడు వినీత్ రెడ్డి & శ్రీనిధి రెడ్డి ల వివాహ వేడుకలలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్,మాజీ డీసిసీబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తో పాటు పాల్గొన్న భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ మరియు స్థానిక బీ ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలలోని కళ్యాణ మండపాలలో జరిగిన పలు వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు దండెం రాంరెడ్డి వారితో పాటు వారి సోదరులు దండెం నరసింహా రెడ్డి , దండెం కృష్ణ రెడ్డి మాజీ కౌన్సిలర్ తదితర నాయకులు పాల్గొన్నారు.**

# ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ లోనీ ఈవీఎం గోడౌన్ ను జిల్లాకలెక్టర్ సి.నారా యణ రెడ్డి శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్ర పరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తది తరులు ఉన్నారు.






# వినాయక దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట

- ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక కార్పొరేటర్

**పెద్ద అంబర్ పేట, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ లోని శ్రీ లక్ష్మీ గణపతి కాలనీ (అల్లూరి కాలనీ) లో నూతనంగా ని ర్మించిన వినాయకుని దేవాలయం నందు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతి థులుగా పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు దేవాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్థానిక ప్రజలకు ఎల్లవేళలా మంచి జరగాలని కోరారు ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

cinema updates




# ఇన్నాళ్లు ఎక్కడ ..!

నటుడిగా ప్రయాణం మొదలు పెట్టినప్పటి నుంచి సినిమాలు చేస్తూ ఉంటే ఏదో ఒక టైం లో తమ బెస్ట్ ఇచ్చే అవకాశం.. నట విశ్వరూపం చూపించే టైం వస్తాయి. అలాంటి సినిమా ప్రతి యాక్టర్ కి తమ ప్రైమ్ టైం లో పడుతుంటాయి. ఐతే ఆ ఛాన్స్ వచ్చినప్పుడు తమని తాము మలచుకున్న తీరు వారికి సక్సెస్ రూపంలో ప్రేక్షకుల నుంచి ప్రేమ లభిస్తుంది. లేటెస్ట్ గా తండేల్ సినిమాతో నాగ చైతన్యకు ఆ ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా కథ అనుకున్నప్పుడే తాను కమిటైతే కష్టపడాల్సి వస్తుందని ఫిక్స్ అయ్యాడు చైతన్య. అందుకే ఏరి కోరి ఈ కథ ఎంపిక చేసుకున్నాడు. తండేల్ రాజు పాత్ర కోసం తను పడిన కష్టమంతా కూడా తెర మీద కనిపిస్తుంది. జోష్ సినిమాతో కెరీర్ మొదలు పెట్టిన నాగ చైతన్య తన మార్క్ లవ్ స్టోరీస్ లో నటిస్తూ వచ్చాడు. ఈమధ్యనే తనకంటూ ఒక సర్టైన్ యూనిక్ నెస్ తెచ్చుకున్నాడు. ఇక తండేల్ సినిమాలో అయితే నాగ చైతన్య ఇప్పటివరకు చేసిన సినిమాల కన్నీ బెస్ట్ ఇచ్చాడు. సినిమా చూసిన అక్కినేని ఫ్యాన్స్ మాత్రమే కాదు కామన్ ఆడియన్స్ కూడా నాగ చైతన్య గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటున్నారు. సాధారణంగా హీరోయిన్ గా సాయి పల్లవి నటిస్తే ఆమెని డామినేట్ చేస్తూ హీరో ఎలివేట్ అవ్వడం చాలా తక్కువ సందర్భాల్లో జరుగుతుంది. ఐతే తండేల్ సినిమాలో మాత్రం సాయి పల్లవిని నాగ చైతన్య దాటేసేలా పర్ఫార్మ్ చేశాడు. సినిమా కోసం చైతన్య పడిన కష్టం అంతా కూడా తెర మీద కనిపిస్తుంది. నటుడిగా పరిపూర్ణత సాధించిన వాడిగా నాగ చైతన్య కనిపిస్తున్నాడు. మొత్తానికి తండేల్ రాజు గురించి మొదటి నుంచి చెబుతున్నట్టు గానే చైతు అదరగొట్టాడు. ఐతే తండేల్ చూసిన ఫ్యాన్స్ అండ్ ఆడియన్స్ ఇన్నాళ్లు ఈ పర్ఫార్మెన్స్ ఎక్కడ దాచావ్ అనుకునేలా చేశాడు. మొత్తానికి చిత్ర యూనిట్ చెప్పినట్టుగానే అక్కినేని ఫ్యాన్స్ కి ఈ సినిమా ఫుల్ ఫీస్ట్ అందిస్తుంది. సినిమాలో అక్కడక్కడ ఫ్లాస్ ఉన్నా ఓవరాల్ గా టాక్ అయితే పాజిటివ్ గానే వచ్చింది. ఐతే మిగతా యాస్పెక్ట్స్ ఎలా ఉన్నా పర్ఫార్మెన్స్ వైజ్ నాగ చైతన్యని చూసి అక్కినేని ఫ్యాన్స్ మాత్రం సూపర్ హ్యాపీగా ఫీల్ అవుతున్నారు.

# రేటు పెంచేసిన ఐశ్వర్యా

హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. సీనియర్ హీరో రాజేష్ కూతురిగా ఇండస్ట్రీలోకి అడుగపెట్టిన ఐశ్వర్యా రాజేష్ పేరుకే తెలుగమ్మాయి కానీ అమ్మడు ఎక్కువ తమిళ సినిమాలే చేస్తుంటుంది. కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనని తాను నిలదొక్కుకుంది. టాలీవుడ్ లో తెలుగమ్మాయిలకు ఛాన్సులివ్వరని, ఇచ్చినా నిర్మాతలు చాలా కండిషన్స్ పెడతారని అంటుంటారు.అందుకే ఐశ్వర్య కోలీవుడ్ వెళ్లి అక్కడ సినిమాలు చేసుకుంటూ సెటిలైంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండే ఐశ్వర్యా రాజేష్ తన తండ్రి లెగసీని తెలుగులో కంటిన్యూ చేయాలనుకుంది కానీ అనుకున్న విధంగా ఆమెకు అవకాశాలు దక్కక కోలీవుడ్ కు వెళ్లి అక్కడ కెరీర్ ను స్టార్ట్ చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తన టాలెంట్ తో దాదాపు 50 సినిమాల్లో నటించిన ఐశ్వర్యా రాజేష్, రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో వచ్చిన కౌశల్య కృష్ణమూర్తి అనే సినిమా ద్వారా తెలుగు ఆడియన్స్ కు పరిచయమైంది. తర్వాత విజయ్ దేవరకొండతో కలిసి వరల్డ్ ఫేమస్ లవర్ సినిమాలో నటించింది. ఆ తర్వాత టక్ జగదీష్ లో నానికి మరదలిగా కూడా నటించింది.సాయి ధరమ్ తేజ్ రిపబ్లిక్ సినిమాలో కూడా మెరిసిన ఐశ్వర్యా రాజేష్ కు ఆ సినిమాలేవీ సాలిడ్ సక్సెస్ ను ఇవ్వకపోగా ఎవరికీ గుర్తు కూడా లేవు. అమ్మడు తెలుగులో చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తానే కొట్టాయి. కానీ రీసెంట్ గా ఐశ్వర్య నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా పాజిటివ్ టాక్ తో బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ ను రాబట్టి బ్లాక్ బస్టర్ గా నిలిచింది.సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో భాగ్యం పాత్రతో అందరినీ మెప్పించిన ఐశ్వర్యా రాజేష్ కు ఈ సినిమా హిట్ తర్వాత ఛాన్సులు క్యూ కడుతున్నట్టు తెలుస్తోంది. అయితే అవకాశాలొచ్చాయని ప్రతీ సినిమానూ ఓకే చేయకుండా కథల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుందని తెలుస్తోంది. కథ బావుండటంతో పాటూ తన పాత్రకు ప్రాధాన్యత ఉండాలని, అప్పుడే సినిమాను ఓకే చేస్తానని నిర్మొహమాటంగా చెప్పేస్తుందట. దానికి తోడు సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత ఐశ్వర్యా తన పారితోషికాన్ని కూడా భారీగా పెంచినట్టు సమాచారం. ఇంతకు ముందు సినిమాకు కోటి రూపాయిలు తీసుకునే అమ్మడు ఈ సినిమా తర్వాత రూ.3 కోట్లు నుంచి రూ.4 కోట్లు డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.






# శుభాకాంక్షలు చెప్పి ట్విస్ట్ ఇచ్చిన పాయల్..!

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన మిస్టరీ థ్రిల్లర్ మంగళవారం ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒక అమ్మాయి వింత సమస్యతో బాధపడుతూ ఉంటే, సమాజంలో ఆమె ఎదుర్కొనే ఇబ్బందులను గురించి దర్శకుడు ఒక మంచి స్క్రీన్‌ప్లేతో దానికి థ్రిల్లర్ ఎలిమెంట్స్, హర్రర్ ఎలిమెంట్స్ జోడించి చూపించాడు. ఆకట్టుకునే కథ, స్క్రీన్ ప్లేతో మంగళవారం రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే మంగళవారం సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. దర్శకుడు అజయ్ భూపతి చాలా రోజుల క్రితమే మంగళవారం కి సీక్వెల్ ఉంటుంది అంటూ అధికారికంగా ప్రకటించారు. సీక్వెల్‌కి సంబంధించిన కథ, స్క్రిప్ట్ వర్క్‌కి చాలా సమయం పట్టింది. ఎట్టకేలకు ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభం అయ్యింది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఈ సమయంలో పాయల్ రాజ్ పూత్ నుంచి వచ్చిన ట్వీట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆమె ట్వీట్ చాలా పెద్ద ట్విస్ట్‌ను సైతం ఇచ్చినట్లు అయ్యింది. చిత్ర యూనిట్ సభ్యులు అందరికీ శుభాకాంక్షలు చెప్పడం ద్వారా మంగళవారం సీక్వెల్‌లో తాను నటించడం లేదని ట్విస్ట్ ఇచ్చింది. మంగళవారం సినిమా అనగానే పాయల్ రాజ్‌పుత్ గుర్తుకు వస్తుంది. సినిమాలోని ఆమె నటన గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నట్లు ఉంటుంది. ఆమె బోల్డ్‌గా నటించడం వల్లే మంగళవారం అంతటి విజయాన్ని సొంతం చేసుకుంది. అలాంటి విజయాన్ని సొంతం చేసుకున్న పాయల్ కచ్చితంగా సీక్వెల్‌లో ఉంటుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా పాయల్ రాజ్‌పుత్ సీక్వెల్‌లో ఉండటం లేదని తెలుస్తోంది. దర్శకుడు అజయ్ భూపతి మరో ముద్దుగుమ్మతో సినిమాను చేసేందుకు ప్లాన్ చేస్తున్నారా అనే చర్చ మొదలు అయ్యింది. మొత్తానికి పాయల్ చేసిన ట్వీట్ తో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తనకు ఎంతో ఇష్టమైన దర్శకుడు అజయ్ భూతికి శుభాకాంక్షలు. ఆయన దర్శకత్వంలో నటించడంను ఎప్పటికీ మరచిపోలేను. కచ్చితంగా మరో మంచి మాస్టర్ పీస్ సినిమా రానుంది. ఆ సినిమా కోసం నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను అంటూ మంగళవారం సినిమాకు సంబంధించిన హింట్ ఇచ్చింది. సక్సెస్ లెగస్సీ కంటిన్యూ కావాలంటూ శుభాకాంక్షలు చెప్పింది. అతి త్వరలోనే మంగళవారం సీక్వెల్ హీరోయిన్ ఎవరు, ఇతర నటీనటులు ఎవరు అనే విషయమై క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# క్రిష్ -4 లో టాలీవుడ్ బ్రదర్స్



మానవతీత శక్తుల విన్యాసాల నేపథ్యంలో తెరకెక్కిన 'క్రిష్' ఫ్రాంచైజీ ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన మూడు భాగాలు భారీ విజయం సాధించాయి. దీంతో రెండు మూడేళ్లగా 'క్రిష్ -4'కి సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ విషయంలో దర్శకుడు రాకేష్ రోషన్ ఎంతో కేరింగ్ తీసుకుంటున్నారు. స్టోరీ కోసమే కొన్ని సంవత్సరాలుగా పనిచసారు. తాజాగా ఇటీవలే స్టోరీ సహా అన్ని పనులు సిద్ధం చేసినట్లు ప్రకటించారు. మునుపటి భాగాలకంటే మరింత ప్రతిష్టాత్మకంగా 'క్రిష్-4'ని ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్క్రిప్ట్ కి బడ్జెట్ సమస్యలు కూడా తలెత్తినట్లు రాకేష్ రోషన్ ప్రకటించారు. అలాగే రాజీ పడేది లేదని కూడా అన్నారు. 'క్రిష్ -4' పూర్తిగా అంతరిక్షంలోనే చూపించబోతున్నారు. ఈ నేపథ్యంలో టెక్నికల్ గా సినిమా హైలైట్ అవుతోన్న నేపథ్యంలో బడ్జెట్ భారీగా పెరుగుతుంది. దీంతో నిర్మాణంలో భాగమయ్యే అవకాశం ఎవరికైనా ఉండొచ్చు అన్న దోరణిలో రాకేష్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో కి టాలీవుడ్ బ్రదర్స్ యంగ్ టైగర్ ఎన్టీఆర్-కళ్యాణ్ రామ్ ఎంటర్ అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంలో తారక్ లీడ్ తీసుకుని అన్నయ్యని, హరిని ముందుకు తీసుకెళ్తున్నారట. పెట్టుబడి ఎంత అన్నది తెలియదు గానీ నిర్మాణంలో వాటాదారులుగా మాత్రం ఎంటర్ అవుతున్నట్లు బలంగా వినిపిస్తుంది. ప్రస్తుతం తారక్ బాలీవుడ్ లో హృతిక్ రోషన్ తో కలిసి 'వార్ -2'లో నటిస్తోన్న సంగతి తెలిసిందే.ఇదే తారక్ తొలి హిందీ సినిమా. ఈ ప్రాజెక్ట్ లో హృతిక్ తో నటిస్తున్నప్పటి నుంచి ఇద్దరు క్లోజ్ ఫ్రెండ్స్ గానూ మారిపోయారు. ఇప్పుడా స్నేహమే హృతిక్ సినిమా నిర్మాణంలో భాగమయ్యేందుక తీసుకెళ్తుందని తెలుస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.